# శుభసంకల్పం

-ఉమాదేవి

జమిందారుగారు మరణించడంతో అమెరికా విడిచిపెట్టి సతీ సమేతంగా తరలి వచ్చేసారు చిన్న జమిందారుగారు తన స్వస్థలానికి. తండ్రిగారి దశాహము పూర్తి కాగానే దివాణం రూపురేఖలు మార్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. భవనం ఆకారం చెడిపోకుండా మరమ్మత్తులు చేపట్టారు. విద్యుద్దీపాలూ, రకరకాల పూల చెట్లతో దివాణాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. విమానాల్లాంటి కొత్తకార్లు రెండు దివాణంలో చేరాయి. ఒకటి జమిందారుగారికీ, మరొకటి ఆయన శ్రీమతికీ. తాతలనాటి ఆస్తి, ఆదాయం, రెండు తరాలవరకు కూర్చుని ఖర్చు చేసినా తరగనిది. దానికితోడు అదనంగా అమెరికాలో సంపాదించినదీ ఉంది. అయితే ఆస్తినీ, ఆదాయాన్ని సన్మార్గంలో వెచ్చించాలన్నదే ఆయన సంకల్పం.

స్వల్పకాలంలోనే ఆస్తిపాస్తులమీద అవగాహన ఏర్పడింది. గ్రామ స్థితిగతులను ఆకళింపు చేసుకున్నారు. తండ్రిగారి పుణ్యతిథి సమీపించేసరికి దివాణమంతా కొత్త శోభ సంతరించుకుంది.

గ్రామపెద్దలందరితో సఖ్యత పెంచుకున్నారు. అమెరికాలో పెద్ద హోదాతో కూడిన ఉద్యోగంలో ఉన్నా ఆయన ఎంతటి సౌమ్యులో, మన సంప్రదాయంపట్ల వారికెంత మక్కువో కొద్దికాలంలోనే గుర్తించారు గ్రామస్థులంతా. దివాణంతోపాటు గ్రామానికి కూడా మెరుగులు దిద్దించారు జమిందారుగారు. శిథిలావస్థలో ఉన్న బడికి తండ్రిగారి పేరున నూతన భవనం నిర్మించారు. రెండు బావులు తవ్వించి తల్లగారి పేరున కుళాయిలు పెట్టించారు. చక్కటి సిమెంట్ రోడ్లు వేయించారు. ఆ గ్రామమే కాదు, పరిసర గ్రామ వాసులు కూడా చిన్న జమిందారు గారి ఔదార్యానికి జేజేలు పలుకుతున్నారు.

చిన్న జమిందారుగారి రాకతో గ్రామం ఎంతో వైభవం సంతరించుకున్నా వేణుగోపాల స్వామి ఆలయం మాత్రం శిథిలావస్థలోనే ఊగిసలాడుతోంది. అంతేకాదు, గత కొన్ని మాసాలుగా దేవాలయ నిర్వహణకు నెలనెలా దివాణం నుండి వచ్చే భృతి కూడా నిలిపివేయబడింది. దైనందిన పూజలలో పళ్లెంలో వచ్చిన ద్రవ్యమే ఆలయ అర్చకులు గోపాలాచార్యులు దినభత్యంగా మారింది. దైనందిన పూజలు, అర్చనలూ కూడా అంతంత మాత్రంగానే జరుగుతున్నాయి. ఆచార్యులవారికి రోజులు గడవడం దుర్భరమవుతుంది. తన గోడు జమిందారుగారికి వినిపించాలని, రెండు పర్యాయాలు దివాణం తలుపు తట్టాడు. కానీ భూతపతి కోసం వెళ్తే భృంగిరిటీ ఎదురైనట్లు దివాణం గుమస్తా గుర్నాథం ఎదురుపడ్డాడు. జమిందారుగారి దర్శనం లభించలేదు రెండుసార్లు. రెండు నెలలు గడిచేసరికి ముంజేతి బంగారు కడియం బజారుపాలుకాక తప్పలేదు.

***

ఆ రోజు సాయంత్రం గుడి తలుపులు మూసెయ్యబోతున్న సమయంలో దివాణం గుమాస్తా గుడిలోనికి ప్రవేశించాడు. ఆడబోయిన తీర్థం ఎదురొచ్చినట్లయింది ఆచార్యులవారికి.

"నమస్కారం గుర్నాథంగారు! గుడి మూసాక మీ వద్దకే రావాలనుకుంటున్నాను. నా అంతరంగం తెలుసుకుని ఆ వేణుగోపాలుడే మిమ్మల్ని పంపినట్టున్నాడు" అన్నారు.

తీర్థం పుచ్చుకున్నాక "రండి... అలా మండపం మీద కూర్చుందాం" అన్నాడు గుర్నాథం. అతడిచ్చిన దక్షిణ తీసుకుని పళ్లాన్ని స్వామి పాదాలవద్ద ఉంచి గురునాధాన్ని అనుసరించారు ఆచార్యులు.

"మీ బాధలన్నీ ఆయన చెవిలో వేసాను. పిల్ల పెళ్లికెదిగి ఉన్నదని కూడా ఎరుక పరిచాను" అన్నాడు గుర్నాధం.

"అయ్యా వారేమన్నారేమిటి?" కుతూహలంగా అడిగారు ఆచార్యులవారు ఆయనకెదురుగా కూర్చుంటూ.

"ఆయనకి సరైన సమయంలో సరైన సహాయం చేద్దాం అన్నారు నా మాటలు మధ్యలోనే తృంచేస్తూ."

"పరిస్థితి దినదినగండంగా ఉంటే ఇంకా సరియైన సమయం వచ్చేదెప్పుడు?" నిట్టూర్చాడు ఆచార్యులు.

"నేను ఇదివరకే చెప్పాను మీకు ఆచార్యులగారూ. మీరు వేద పండితులు. పదిమంది బ్రాహ్మణ పిల్లలకు వేదం చెప్తే వారిచ్చే తృణమో పణమో చన్నీళ్లకి వేణ్ణీళ్లలా అయ్యేను మీరు. రేపు మన గ్రామంలోనూ పరిసర గ్రామాల్లోనూ నిత్య నైమిత్తకర్మలు చేయడానికి మీ అనుచర గణం కూడా ఏర్పడేను. మన ప్రాంతంలో ఒక్క పనస అయినా తప్పుల్లేకుండా చెప్పే బాపడున్నాడా? ఏ కర్మ చేయవలసి వచ్చినా పదిహేను కోసులు పోవాల్సిందేకదా" అన్నాడు గుర్నాధం.

"ఇప్పుడు వేదం చెప్పే ఓపికెక్కడుంది నాకు గుర్నాథంగారూ? స్వామి సంకల్పం ఎలా వుంటే అలాగే జరుగుతుంది. మా కుటుంబ భారం అంతా ఆ స్వామిపైనే పెట్టేసాను. నీట ముంచినా పాలముంచినా ఆయనదే భారం" దీర్ఘంగా నిట్టూర్చారు ఆచార్యులు.

"మరోసారి . ఆలోచించండి" అంటూ లేచాడు గుర్నాథం.

"అమెరికాలో వున్నా మన పురాణాలు, వేదాలపట్ల మంచి అవగాహన కలవారని విన్నాను. మరి జమిందారుగారు వేణుగోపాల సేవకునిపై


శీత కన్ను ఎందుకు వేసారో'' ఆచార్యులు నిట్టూర్చారు.

వెళ్లిపోతున్నవాడల్లా వెనక్కివచ్చి "చెప్పడం మరిచాను. రేపు జమిందారుగారి పుణ్య తిథి. దివాణంలో సంతర్పణ ఉంది. తదనంతరం ఓ మహానుభావుని సత్కరించి లక్ష రూపాయలు ఉపహారం కూడా ఇస్తారుట. ఆ మహానుభావుని పేరు మాత్రం గోప్యంగా ఉంచారు. అష్టాదశ పురాణాలూ, చతుర్వేదాలూ పుక్కిట పట్టిన మీరే ఆ మహానుభావుడు ఎందుకు కాకూడదు? వంటలు, వడ్డనలు శుచీ శుభ్రతతో జరుగుతాయి. మీరు తప్పకుండా రండి'' అన్నాడు గుర్నాథం.

ఆచార్యుల వదనంలో ఆశారేఖలు పొడచూపాయి.

★★★

జమిందారుగారి పుణ్యతిథి నాటి నిండు సభలో గ్రామ ప్రజలతోపాటు ఆచార్యులవారిని కూడా ఆశ్చర్యపరుస్తూ చిన్న జమిందారుగారు జగన్నాథం మాష్టారుని సన్మానించి లక్ష రూపాయలు ఉపహారం ఇస్తూ చెప్పిన మాటలు ఆచార్యులను తొలుత నిరుత్సాహపరచినా ఉపన్యాసం ముగింపుకు వచ్చేసరికి ఆచార్యుల మదిలో తీవ్రమైన అలజడి చెలరేగింది. తత్ఫలితమే నాలుగు దినాలనంతరం ఆలయ మండపం



వేదపాఠశాలగా రూపుదిద్దుకుంది.

★★★

ఆ రోజు వ్యాసపూర్ణిమ. వేద విభాగ విద్యాసముల్లాసుని జన్మదినం. ఆలయ ప్రాంగణంలో ఆచార్యులను ఘనంగా సన్మానించారు జమిందారు గారు. ఆ పిమ్మట గంభీర గంగా ప్రవాహమే అయింది ఆయన ప్రసంగం.

“ఇంతటి వృద్ధాప్యంలో కూడా ప్రతిఫలం ఆశించకుండా విద్యాదానం చేస్తూ ఎందరో చిన్నారులను ఉత్తమ భావి పౌరులుగా తీర్చిదిద్దుతున్న జగన్నాథం మాస్టారుని అందరూ ఆదర్శనంగా తీసుకోవాలని మేం ఆనాడు ఆకాంక్షించాం. మాస్టారి స్ఫూర్తి ఆచార్యులకు మూర్తివంతమైంది. ఈ ఆలయ ప్రాంగణంలో చక్కటి వేద పాఠశాల వెలసింది. ‘ఏకం విప్రా బహుదా వదంతి’ అనేది ఆర్యోక్తి. బహు రూపాలలో మనదే పూజలందుకుంటున్న పరమాత్మ ఒక్కడే అనునది ఆర్యుల అభిప్రాయం. అయితే యోగులు, సిద్ధులూ మాత్రమే సర్వవ్యాపియైన ఆ పరమాత్మను దర్శించ గలరు. సామాన్యులకు ఏదో రూపంలో భగవంతుని ఉనికిని తెలియజేసేవి మహాత్ముల ప్రవచనాలూ, పురాణేతిహాసాలూ, దేవాలయాలు మాత్రమే. దేవాలయం అంటే గాలిగోపురం, బలిపీఠం, ధ్వజస్తంభం, గర్భ గుడి...ఇత్యాది కట్టడాలు కాదు. మానవాతీత శక్తి ఒకటి ఉందనీ, అది మనం చేసే మంచి చెడులను గమనిస్తూ ఉంటుందనీ సామాన్య మానవులలో పాపభీతి, భక్తినీ పెంపొందిస్తూ వారిని పాపకర్మలకు విముఖుల్ని చేసే పవిత్ర ప్రాంగణాలు. మానవునికి మంచిని చేకూర్చి పెట్టే ఈ ఆలయాలు విలసిల్లాలంటే శాస్త్ర విధి హితములైన ధూప దీప నైవేద్యాలతో అర్చనలు జరగాలి. ఈ పూజా విధానం ఈ తరం వారితో అంతమయ్యే ప్రమాదం సంభవించకూడదు. భావి తరాలవారికి కూడా సంక్రమింపజేయాలి. ఆగమ గ్రంథాల అధ్యయనం, వేద పఠనం, వేదసారాన్ని అర్థం చేసుకోవడం భావి తరాల వారికి కూడా అవసరం. కొన్ని వేల సంవత్సరాల కాలం నుండి కాపాడుకుంటూ వస్తున్న మన వేద సంపద ఈ తరంతో అంతరించిపోకూడదు. మన తరువాత తరంవారికి దానిని సంక్రమింపజేసే బాధ్యత మనపైన ఉంది. మన ప్రాంతంలో ఆచార్యులను మించిన వేద పండితులు లేరు. అయితే వారిలోని పాండిత్యం నిద్రాణమై నిలిచిపోకూడదు. అది మరింత తేజోవంతమై తరువాత తరంవారికి సంక్రమించాలి.

అన్నీ తెలిసిన ఆయన మాత్రం తాము జీవించది తమకోసం, తమ వారి కోసం మాత్రమేనన్న స్వార్థంతో జీవిస్తున్నారు. భగవంతునిపై భారంవేసి నైరాశ్యంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఏదైనా కార్యం ఒకర్ని బాధించో, భయపెట్టో చేయించలేం. అతడా కార్యం చేపట్టేలా పరిస్థితులను కల్పిస్తే ఆ కార్యం నిర్విఘ్నంగా కొనసాగుతుంది. ఆచార్యులు ఈ విద్యాబోధనకు సుముఖంగా లేరనీ, వేరే ప్రాంతం నుండి వేద పండితుడ్ని తెచ్చి వేద విద్య తరగతులు నిర్వహించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని కొందరు పెద్దలు మాకు సూచించారు. మన గ్రామంలోనే ఓ ఉద్దండ పండితుడు విరాజిల్లుతుండగా వేరే పండితుడ్ని నియుక్తిపరచడం అవివేకమని తలచి ఆచార్యులకు కించిత్ మనఃక్లేశం కలిగించవలసి వచ్చింది. వారు పెద్ద మనసుతో మమ్మల్ని మన్నిస్తారనే అనుకుంటున్నాను. సావర్ణుని మనువులో ఇంద్రపదవిని ప్రసాదించడానికే కదా బలి చక్రవర్తి సమస్తమూ వామనుడిగా వచ్చి శ్రీహరి హరించవలసి వచ్చింది. ఆలయానికి సమకూర్చబడే భృతి నిలుపుదల కేవలం తాత్కాలికం. ఆలయంలో పూజలు, ఉత్సవాలు యధాప్రకారం కాదు, ద్విగుణీకృత రీతిలో కొనసాగుతాయి ఇక నుండీ. ఆలయానికి కొత్త వైభవం చేకూర్చుదాం. ఆచార్యులవారు ఈ దిశలో కార్యోన్ముఖులవ్వాలి. వారి గృహబాధ్యతలు మాకు విదితమే. ఆ ఖర్చులను ఇక నుండి దివాణమే భరిస్తుంది. వారు దిగులు చెందనవసరంలేదు.”

జమిందారుగారు తమ సుదీర్ఘ ఉపన్యాసం ముగించి ఆచార్యులను గమనించారు. ఆలయ ప్రాంగణమంతా ప్రజల కరతాళ ధ్వనులతో కంపించింది. సావధానమంటున్నట్లుగా అభయహస్త ముద్రతో సంజ్ఞ చేసి తన ఆసనాన్ని వీడి నెమ్మదిగా ఆచార్యులను సమీపించి ఆయన పాదాలను స్పృశించారు. అశ్రు నయనాలతో జమిందారుగారిని లేవదీసి అక్కున చేర్చుకున్నారు ఆచార్యులు.

“ఇన్నాళ్లూ నైరాశ్యంలో జీవించాను. ఆ వేణుగోపాలుడే బాబుగారి రూపంలో వచ్చి నా కర్తవ్యం గుర్తు చేసాడు. ఆయన సత్సంకల్పాన్ని సాకారం చేయడానికి చివరి శ్వాస విడిచే వరకూ కృషి చేస్తాను. ఆయన చిరకీర్తితో చిరంజీవిగా వర్ధిల్లాలని ఆశీర్వదిస్తున్నాను” అన్నారు.

గర్భగుడిలో గంటలు మ్రోగాయి!

★



## ఇది నిజమా?

పార్వతి మెల్టన్‌కి సినిమా ఇండస్ట్రీతో ముందు నుంచీ ఎలాంటి సంబంధాలు లేకుండానే సినిమా తార అయింది అనుకున్నారంతా. కానీ తాజాగా ప్రచారంలోకి వచ్చిన సంగతేంటంటే- రచయిత-దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌కి పార్వతి మేనకోడలి వరసవుతుందని అంతా చెప్పుకుంటున్నారు.. ఇందులో నిజానిజాల మాటెలా వున్నా ‘జల్సా’ తర్వాత త్రివిక్రమ్ దర్శకత్వంలో పార్వతి మెల్టన్ ‘వరుడు’లో కూడా హీరోయిన్‌గా నటించడం అనేది ఈ వార్తలకి కొంత బలం చేకూరుస్తోంది.

